
# సత్యవాక్యు

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

DECEMBER - 2009

సంవత్సర చందా రూ. 50/-

# సంక్షిప్త వార్తలు

2009 నవంబరు 5,6,7 తేదీలలో నడిపూడిలో యున్న క్రీస్తు సంఘము బైబిలు తరగతులు ఘనంగా నిర్వహించిరి. పరిసర ప్రాంతములలో యున్న స్థానిక సంఘముల వారు కూడా హాజరై దేవుని అమూల్య సందేశములను ఆలకించి ఆత్మీయముగా బలపడిరి, ఆ బైబిలు తరగతులలో బ్రదర్. యన్. ఏలియా (దేవగుప్తం), సి. హెచ్. జాన్‌బాబు (ముంగండ), డి. చిరంజీవి (బండార్లంక), జాషువాగూటం గార్లు వాక్యపరిచర్యచేసిరి. తద్వారా దేవుని నామము ఘనపరచబడెను. నడిపూడి, బండార్లంక, అగ్రహారం, పాలగుమ్మి గ్రామములలో సోదరులు డి. చిరంజీవి గారు ఎంతగానో శ్రమించి క్రీస్తుకొరకు బలమైన పనినిచేయుచున్నారు.

నవంబరు 19వ తేదీ ఉదయం రిక్కీగూటం గారు, సతీసమేతంగాను, ఆయన కుమారుడు జస్టిన్ గూటం గారితోను మూడునెలల అమెరికా పర్యటన ముగించుకొని ఇండియా క్షేమముగా తిరిగిచేరుకొనిరి. రాజమండ్రి విమానాశ్రయములో వారికి ఘనస్వాగతం లభించెను.

నవంబరు 23వ తేదీనాడు ఆచంట మండలం పెదగురువులో గొప్ప సువార్త కూటము జరిగెను. ఆచంట కరుగోరుమిల్లి, పెళ్లికూతరమ్మ చెరువు, పెనుమంచిలి, తామరాడ సంఘములు, వారి నాయకులు సంతోషముగా ఆకూటములో పాలుపొంది, మంచి క్రైస్తవ సహవాసమును రుచిచూచిరి. అమెరికా నుండి వచ్చిన సోదరులు బిల్లీబ్లాండ్, రేమేపుల్స్, డిలాన్‌కూపర్, ఆర్ట్‌క్రో, ఏంగ్రూవిల్సన్, స్టీవెన్‌సట్టన్ గార్లును, 15ఏళ్ళ ప్రాయముగల హెయిలీకూపర్ గారును ఆకూటములో పాల్గొనిరి. కొందరు వాక్యపరిచర్యచేసిని. రిక్కీగూటం గారు, జిమ్‌ప్రకాశ్‌గారు అనువదించిరి. కూటం అనంతరం 13 మంది క్రీస్తులోనికి బాప్తీస్మముపొందిరి. పెదగురువులో సోదరులు గోసాల సూర్య ప్రకాశరావుగారు ఆయన కుమారుడు చిట్టిబాబు సువార్తచేయుచున్నారు. సోదరులు యన్. మోజెస్, యం. జోసఫ్, సి. హెచ్. జయకుమార్ మరియు తదితరులు హాజరై గొప్పసహాయ సహకారములనందించిరి.

నవంబరు 24వ తేదీ మంగళవారం రామచంద్రాపురం కుమ్మరవీధిలో యున్న క్రీస్తుసంఘములో పైనుదహరించిన సోదరసోదరీలు వాక్య పరిచర్యచేసిరి. భారతదేశపు క్రీస్తుసంఘములు అమెరికా దేశ సంఘములకు

# సత్యవాక్యం

# THE WORD OF TRUTH

P.o. Box -80, Kakinada,A.P. 533 001

Ph : 0884 - 2363722

Editor :

**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి - 30 | డిశంబరు - 2009 | సంచిక - 5


## పాపక్షమాపణ నిమిత్తం సువార్తకు లోబడుట

(Obeying the Gospel for the Remission of Sins )

ఈరోజు పాపక్షమాపణ నిమిత్తము సువార్తకు లోబడుట అనేఅంశాన్ని ధ్యానించుదాం." యోహాను చెరపట్టబడిన తరువాత యేసు,కాలము సంపూర్ణమై యున్నది, దేవుని రాజ్యము సమీపించి యున్నది; మారుమనస్సు పొంది సువార్తనమ్ముడని చెప్పుచు దేవుని సువార్త ప్రకటించుచు గలిలయకు వచ్చెను" అని మార్కు వ్రాసాడు (మార్కు 1:14,15).

"ప్రభువైన యేసు తన ప్రభావము ను కనుపరచు దూతలతో కూడ పరలోక మునుండి అగ్నిజ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతి దండన చేయును" అని అపో.పౌలు చెప్పాడు (2థెస్స 1:6-8). తీర్పు మన యొద్దనే ఆరంభమైతే దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమగును? అని 1పేతురు 4:17 చెప్పుచున్నది. అంటే యేసు ప్రభువు మరల వచ్చుసరికి ఎవడైనా సువార్తకు లోబడకుంటే అతడు దేవుని ప్రతిదండనకు గురియగునని ఈ లేఖన భాగములు బోధించుచున్నవా?

ఖచ్చితముగా అవునని మనం చెప్ప వచ్చును.

గనుక మానవుడు పాపముల నుండి రక్షింపబడాలంటే అతడు సువార్తకు లోబడాలి. గనుక సువార్త అనగా యేమిటి ? ఒకడు సువార్తకు ఎట్లు లోబడతాడు ? అనే ప్రశ్నలను మనం వేసుకోవాలి. సువార్త అనగా బైబిలు బోధ, క్రొత్తనిబంధన బోధయని మనము సామాన్యముగా చెప్పుకొన్నా, అది మానవ చరిత్రలో జరిగిన ఒక చారిత్రాత్మక సంఘటనయై యున్నది.

యేసుప్రభువు మానవ శరీరధారియై వచ్చిన దేవుడు. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడై యుండెను". "ఆ వాక్యము శరీరధారియై కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను" అని యోహాను చెప్పాడు (యెహాను 1:1; 1:14).

శరీరధారియై వచ్చిన వాక్యమైన దేవుడే యేసుక్రీస్తు. ఆయనే దేవుని అద్వితీయ కుమారుడు (యోహాను 3:16). యిది మానవులకు మంచి వార్తయైయున్నది. 1కొరింథీ 15:1-4లో సువార్తయొక్క నిర్వచనం మనకీయబడి యున్నది: "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియపరచు చున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచి యున్నారు..... అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మనపాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధిచేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను". మానవుని పాపపు సమస్యకు సువార్త గొప్ప పరిష్కారవర్తమానమై యున్నది.

యేసుక్రీస్తు మనపాపముల నిమిత్తమై సిలువపై చనిపోయెను. యెరూషలేముకు వెలుపల ఒక సిలువపై యేసుప్రభువు నిజముగా చనిపోయెను. ఆయన మనందరి పాపముల నిమిత్తము చనిపోయెను. దీనిని ప్రపంచమంతటికిని ప్రచుర్యపరచవలసియున్నది. యేసు సమాధి చేయబడెను, మూడవదినమును తిరిగి లేచెను. "ఇప్పుడైతే నిద్రించిన వారిలో ప్రథమ ఫలముగా క్రీస్తు మృతులలోనుండి లేపబడియున్నాడు". మరెన్నడు చనిపోకుండు నిమిత్తము పునరుత్థానులైన వారిలో ప్రథముడు యేసుప్రభువు. ఆయనయందు విశ్వాస ముంచువారు ఆయన వలెనే తిరిగి లేస్తారనే హామీని దేవుడు మనకిచ్చారు.

క్రీస్తుయొక్క పునరుత్థానము మానవుని భౌతిక మరణ సమస్యను పరిష్కరించుచున్నది. మనకొకపాప సమస్య యున్నది. పాపముల నిమిత్తమై క్రీస్తుచనిపోయారు. మనకొక మరణ సమస్యయున్నది. క్రీస్తు మరణించి తిరిగిలేచారు. అందువలన సువార్త యొక్క ముఖ్య

సూత్రములు యేసుప్రభువు యొక్క మరణపునరుత్థానములు. మన రక్షణార్థమై ఈ సంఘటనలు శుభవార్తయై యున్నవి. మానవుని పాపపు సమస్యను పరిష్కరించు దేవునితో సమాధానము నేర్పరచు చారిత్రాత్మక వాస్తవములివి.

సువార్త అనగా యేమిటో తెలిసికొన్నాము. అయితే మనము సువార్తకు లోబడాలంటే యేమి చేయాలి? ఇంకోమాటలో దేవుని కుమారుడైన క్రీస్తు మరణసమాధి పునరుత్థానములకు మనం ఎట్లు విధేయులము కావాలి? మరల పరిశుద్ధాత్మ దేవుడే ఈ ప్రశ్నకు మనకు జవాబిచ్చుచున్నాడు: రోమా 6:3-6లో ఈలాగున వ్రాయబడియు న్నది:

"క్రీస్తుయేసు లోనికి బాప్తిస్మము పొందిన మనమందరము ఆయన మరణములోనికి బాప్తిస్మము పొందితిమని మీరెరుగరా? కాబట్టి తండ్రి మహిమ వలన క్రీస్తు మృతులలో నుండి యేలాగులేపబడెనో, ఆలాగే మనమును నూతన జీవము పొందినవారమై నడుచుకొనునట్లు, మనము బాప్తిస్మము వలన మరణములో పాలు పొందుటకై ఆయనతో కూడ పాతిపెట్టబడితిమి. మరియు ఆయన మరణము యొక్క సాదృశ్యమందు ఐక్యము గల వారమైన యెడల, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమం దును ఐక్యము గల వారమై యుందుము. ఏమనగా మనమికను పాపమునకు దాసులము కాకుండుటకు పాప శరీరము నిరర్థకమగునట్లు మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడెనని యెరుగుదుము".

ఈ రోజు ఒకడు క్రీస్తు మరణము లోనికి యెట్లు బాప్తిస్మము పొందగలడు? బాప్తిస్మములో ఒకడు నీటిలో ముంచ బడును, లేదా యేసుతో సాదృశ్యముగా పాతి పెట్టబడును. "మీరు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతిపెట్టబడితిరి" యని కొలస్స 2:12 చెప్పుచున్నది.

మనము ఆయన మరణ సమాధికి సాదృశ్యముగా నీటిలో పాతిపెట్టబడితే, ఆయన పునరుత్థానము యొక్క సాదృశ్యమందును పాలివారమై యుంటాము. అంటే ఆయన సమాధినుండి ఎట్లు లేచాడో, మనమును నీటి సమాధినుండి లేతుము. బాప్తిస్మము ఒక సూక్ష్మ మార్గమైయున్నది. పాపక్షమాపణ నిమిత్తము మనము బాప్తిస్మము పొందినప్పుడు, క్రీస్తుయొక్క మరణ సమాధి పునరుత్థానములకు లోబడుచున్న వారమగుదుము.

మారుమనస్సు పొందిన విశ్వాసి, నీటి బాప్తిస్మము నుండి వెడలివచ్చునప్పుడు నూతన స్వభావము గలవాడై, ఒకనూతన జీవిగా వెడలి వచ్చును. అయితే ఒకడు

యేసుతో నీటి సమాధిలో ఐక్యము గలవాడగుటకు ముందు, తన పాపముల విషయమై తాను మృతినొందినవాడు కావలెను. అందుకే మన ప్రాచీన స్వభావము ఆయనతో కూడ సిలువ వేయబడా లని అపొ.పౌలు చెప్పాడు (రోమా 6:6).

క్రైస్తవుడైనవాడు, "నేను క్రీస్తు తో కూడ సిలువ వేయబడి యున్నాను; ఇకను జీవించువాడను నేను కాను, క్రీస్తే నాయందు జీవించుచున్నాడు" అని పౌలువలె చెప్పగలగాలి (గలతీ 2:20). "మీరు క్రీస్తుతో కూడ లేపబడిన వారైతే పైనున్న వాటినే వెదకుడి; అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చొని యున్నాడు". "ఏలయనగా మీరు మృతిపొందితిరి; మీ జీవము క్రీస్తుతో కూడ దేవుని యందు దాచబడి యున్నదని" పౌలు మరల చెప్పుచున్నాడు (కొలస్స 3:1-3).

విశ్వాసియైన వాడు మారు మనస్సు పొందినప్పుడు, వారు తమ శరీరేచ్ఛలను సిలువ వేసిన వారై దేవుని తట్టు తిరుగుదురు.

ఒకడు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినపుడు ఆయన శరీరములోనికి బాప్తిస్మము పొందును. ఆయన శరీరమే ఆయన సంఘము (కొలస్స 1:18). దేవుని యందలి సమస్త ఆత్మీయాశీర్వాదములు క్రీస్తులోను, ఆయన సంఘములోను ఉన్నాయి. ఆయనకు వెలుపల ఒక్క ఆత్మీయాశీర్వాదము కూడలేదు.

నీవు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందగోరుచున్న యెడల, ఈరోజే నీకు దగ్గరగా యున్న క్రీస్తు సంఘమును దర్శించుము; లేదా మాతో సంప్రదించుము !!

## మంచి గృహ నిర్వాహకుడు
(A Good Steward)

ఈలోకంలో మానవునికి తన స్వంతం అంటూ యేమీలేదు. ఏమైనా ఉంటే అది దేవుని వలన కొంతకాలము మట్టుకు తన కీయబడినదని, దానిని బట్టి అతడు దేవుని యొక్క గృహనిర్వాహ కుడని తెలిసికోవాలి. "మేము క్రీస్తు సేవకులమనియు, దేవుని మర్మముల విషయములో గృహ నిర్వాహకుల మనియు ప్రతి మనుష్యుడు మమ్మును భావింపవలెను" అని అపొ.పౌలు చెప్పాడు (1 కొరింథీ 4:1). గృహనిర్వాహకత్వం విషయంలో క్రైస్తవునికి తప్పించుకొనే అవకాశం లేదు. వారికిష్టమున్నా లేక పోయినా, అందరు గృహనిర్వాహకులే. గృహనిర్వహకత్వములో మంచిగా యుండుటకో లేక చెడ్డగా యుండుటకో ఒకడు నిర్ణయించు

కొవచ్చును. గృహ నిర్వాహకుడనగా తనదికాని సొత్తును, ఆస్థిని లేక పనిని నిర్వహించుటకు బాధ్యత అప్పగింపబడిన వాడు. "ఎందుకనగా నీకు ఆధిక్యము కలుగ జేయు వాడెవడు ? నీకు కలిగిన వాటిలో పరుని వలన నీవు పొందనిది ఏది? పొందియుండియు పొందనట్టు నీవు అతిశయింపనేల ?" (1 కొరింధీ 4:7). "మన మీ లోకములోనికి ఏమియు తేలేదు, దీనిలో నుండి ఏమియు తీసికొనిపోలేము. కాగా అన్న వస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొంది యుందము" (1తిమో 6:7). "నీ దేవుడైన యెహోవాను జ్ఞాపకము చేసికొనవలెను. ఏలయనగా మీరు ... భాగ్యము సంపాదించుకొనుటకై మీకు సామర్థ్యము కలుగజేయువాడు, ఆయనే" (ద్వితీ8:18). గృహ నిర్వాహకత్వములో మంచిగాయుం డాలో లేదో ప్రతి క్రైస్తవుడు ఎంచు కోవాలి.

దేవునితో సత్సంబంధము కలిగి యుండుటకు ధనాన్ని గూర్చిన సరియైన అవగాహన కలిగియుండాలి. ఒకని ఆదాయాన్ని గూర్చి పెట్టుబడిని గూర్చి, సంపాదనను గూర్చి క్రైస్తవ సూత్రములను ఎరిగి యున్నవాడు ఇరుకు మార్గమున పయనించుటకు ఎంచుకొనినవాడు. క్రైస్తవానుభవములో అది ప్రాము ఖ్యము.

మనం గృహనిర్వాకులం, దేవునికి లెక్క అప్పగింప బాధ్యులం. నమ్మకమైన పనివారినుండి అది కోరబడ్డాది. మన సమయాన్ని, తలాంతులను, ధనాన్ని, నిజానికి దేవుడు మన కనుగ్రహించిన వాటన్నిటిని గూర్చి తీర్పునాడు మనం ప్రభువుకు లెక్క అప్పగింప బాధ్యులం. ఈ లోకంలో మనకు ఎంత ఎక్కువ యున్నా, లేక తక్కువ యున్నా, ఆ భయంకర తీర్పునాడు మనం దేవునికి లెక్క అప్పగించాలి.

**చెడ్డ దాసుడెవరు ?**

ఈ పాఠంలో మంచి దాసులను గూర్చి ఆలోచించుచు న్నను, అనేకులు చెడ్డదాసులుగా యున్నారనే కఠోరవాస్తవాన్ని మనం అంగీకరించకతప్పదు. అనేకులు తమకను గ్రహించిన ధనాన్ని అనవసరమైన విలాసములకు, భోగాలకు వినియో గించుచు న్నారు. దేవుడు మనకిచ్చిన భౌతిక సంపదను అంతా మన కొరకే, స్వప్రయోజ నము కొరకే వినియోగించిన యెడల మనం చెడ్డదాసులమవుదుము. ఈ లోకంలో వేలకొలది అనాథ బాలబాలికలు న్నారు. అన్న వస్త్రములు, వసతిలేని వారు కోట్ల కొలది యున్నారు. అట్టి వారికి సహాయము చేయకుండా యుండుటకు మనం యేమీ సాకులు చెప్పలేము.

దేవుడు తన గ్రంధములో చెడ్డదాసుని గూర్చిన ఉదాహరణ మనకు చెప్పారు. "మరియు ఆయన

వారితో ఈ ఉపమానము చెప్పెను. మీరు ఏవిధమైన లోభమునకు ఎడమియ్యక జాగ్రత్తపడుడి. ఒకని కలిమి విస్తరించుట వాని జీవమునకు మూలము కాదనెను. ఒక ధనవంతుని భూమి సమృద్ధిగా పండెను. అప్పుడతడు నా పంట సమకూర్చు కొనుటకు నాకు స్థలము చాలదు గనుక నేనేమి చేతునని తనలో తానాలోచించుకొని – నేనీలాగు చేతును. నాకొట్లు విప్పి వాటికంటె గొప్ప వాటిని కట్టించి అందులో నాధాన్యమంతటిని నా ఆస్థిని సమకూర్చుకొని నా ప్రాణముతోప్రాణమా, అనేక సంవత్సరములకు విస్తారమైన ఆస్తినీకు సమకూర్చ బడియున్నది. సుఖించుము, తినుము, త్రాగుము సంతోషించుమని చెప్పు కొందుననుకొనెను. అయితే దేవుడు వెర్రివాడా, యీ రాత్రి నీ ప్రాణము నడుగుచున్నారు. నీవు సిద్ధ పరచినవి ఎవని వగునని అతనితో చెప్పెను. దేవుని యెడల ధనవంతుడు కాక తన కొరకే సమకూర్చు కొనువాడు ఆలాగుననే యుండునని చెప్పెను" (లూకా 12:16-21).

ఈ మనుష్యునికి విస్తారమైన పంటనిచ్చి దేవుడతని దీవించెను. గాని అతడాయనకు చెడ్డ దాసుడయ్యెను. అతడు నా ప్రాణము , నాఆస్తి, నా సుఖము , నా సంతోషము అనే ఆలోచించుకొనెను గాని యితరులను గూర్చి, దేవుని గూర్చి యేమీ ఆలోచించలేదు. దేవుడతనిని వెర్రివాడా యని పిలిచెను!

## మంచి దాసుడెవరు ?

మంచి దాసునిలో మూడు లక్షణా లుంటాయి. అతడు వీలైనంత ఎక్కువ సంపాదిస్తాడు, ఎక్కువ సమకూర్చుతాడు, ఎక్కువ లోభుడైనవాడు సంపాదించడానికి సమకూర్చ డానికి ఇష్టపడతాడు గాని ఇచ్చుటకు వచ్చేసరికి మూర్ఛిల్లుతాడు!

1. వీలైనంత ఎక్కువ సంపాదిం చాలని బైబిలు బోధించుచున్నది. మత్తయి 25వ అధ్యాయములో 5తలాంతులు గలవానిని, రెండు తలాంతులు గల వానిని యజమా నుడు అభినందించాడు. వారిద్దరు వీలైనంత ఎక్కువ సంపాదించారు (మత్తయి 25:14-27). "అపవాదికి చోటియ్య కుడి. దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కరగలవానికి పంచి పెట్టుటకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచి పని చేయుచు కష్టపడవలెను" (ఎఫెసీ 4:28). మానవుడు కష్టపడి పని చేసి డబ్బు సంపాదించుట యుక్తము. మంచి దాసుని నుండి దేవుడు కోరునది అది. మనుష్యుడు తన శక్తి కొలది పని చేసి డబ్బు సంపాదిస్తే తప్పేమీ లేదు. సోమరి తనాన్ని దేవుడు ఖండించు చున్నారు. "ఎవడైనను పనిచేయనొల్లని యెడల వాడు భోజనము చేయకూడదని" బైబిలు బోధించుచున్నది (2 థెస్స 3:10). "ఆసక్తి

విషయములో మాంద్యులు కాక, ఆత్మయందు తీవ్రత గలవారై ప్రభువును సేవించుడి" (రోమా 12:11).

2. వీలైనంత ఎక్కువ సమకూర్చాలి. "వారు తృప్తిగా తినిన తరువాత ఏమియు నష్టపడకుండ మిగిలిన ముక్కలు పోగుచేయుడని యేసు తన శిష్యులతో చెప్పెను" (యోహాను 6:12). లోభియై దాచుకొనుట ఎంతపాపమో, ఇయ్యబడిన జానిని పాడుజేయుట కూడ అంతే పాపమని యేసు ఇక్కడ తన శిష్యులకు నేర్పించారు. తన ప్రజలు కష్టపడి సంపాదించాలని దేవుడు కోరుచు న్నారు. ఎవరైతే అట్లుసంపాదిస్తారో అట్టివారు దేవుని పనికి సహాయపడ తారు. పిసినితనము గలవారు దేవునికి పనికిరారు. కొరింథీయులకు అపో. పౌలు ఇట్లు వ్రాసాడు: "ఇదిగో యీ మూడవసారి మీ యొద్దకు వచ్చుటకు సిద్ధముగా ఉన్నాను. వచ్చినప్పుడు మీకు భారముగా నుండను. మీ సొత్తును కాదు మిమ్మునే కోరుచున్నాను. పిల్లలు తలిదండ్రుల కొరకు కాదు తలిదండ్రులే పిల్లల కొరకు ఆస్తి కూర్చతగినది గదా" (2 కొరింథీ 12:14). ఒకడు తన కుటుంబము కొరకు పిల్లల కొరకు సమకూర్చుట తప్పుకాదు.

3. వీలైనంత మట్టుకు దేవునికి ఇయ్యవలెను. "నేను వచ్చినప్పుడు చందా పోగు చేయకుండ ప్రతి ఆదివారమున మీలో ప్రతి వాడును తాను వర్ధిల్లిన కొలది తన యొద్ద కొంతసొమ్ము నిలువ చేయవలెను" (1కొరింథీ 16:2). దేవుడు మనలను వర్ధిల్లజేసిన కొలది మన కానుకలనీయాలి. సంఘ సభ్యులందరు ఈ రీతిగ ఇస్తే ఈ లోకం అంతా సువార్త చాటబడ్తాది. నీవు నీ జీతం పెంచబడా లని కోరుకొనుచు న్నావా? నీ కొరకా? దేవునికి ఇచ్చుట కొరకా? నీ వ్యాపారంలో లాభం కావాలని కోరుకొను చున్నావా? ఎందుకు? నీ కొరకా లేక దేవునికిచ్చుట కొరకా?

**మంచిదాసుడు దేవుని సొత్తును గుర్తిస్తాడు:**

మంచిదాసుడు తనకున్న వన్నిటికి సొత్తుదారుడు దేవుడేనని గుర్తిస్తాడు. భూమ్యాకాశములను సృజిం చినవాడు దేవుడే నిజానికి ఆయనే నమస్తానికి సొత్తుదారుడు. "శ్రేష్టమైన ప్రతియీవియు, సంపూర్ణమైన ప్రతివరమును పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రియొద్ద నుండి వచ్చును. ఆయన యందు ఏచంచలత్వమైనను గమనాగమనముల వలన కలుగు ఏఛాయయైనను లేదు" (యాకోబు 1:17). ఆదిమ క్రైస్తవులు దీనిని గుర్తించారు : "విశ్వసించిన వారందరు ఏక హృదయమును ఏకాత్మయు గలవారై యుండిరి ఎవడును తనకు కలిగిన వాటిలో ఏదియు తనదని అనుకొనలేదు" (అపో.కా. 4:32). ఈ భూమి అంతయు దేవునిదే.ఆయనే

దానికి హక్కుదారుడు. "ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించెను" (ఆదికా 1:1). మనలో ఎవడు సృష్టి కార్యక్రమములో పాలుపంచుకోలేదు. "భూమియు దాని సంపూర్ణతయు లోకమును దాని నివాసులును యెహోవావే" (హగ్గయి 2:8). "అడవి మృగములన్నియు వేయికొండల మీద పశువులన్నియు నావే గదా. పొలములలోని పశ్వాదులు నావశమై యున్నవి. లోకమును దాని పరిపూర్ణత యునావే"(కీర్తన 50:10-12). "మీ దేహము దేవుని వలన మీకు అనుగ్రహింపబడి మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా? మీరు మీ సొత్తు కాదు, విలువ పెట్టికొనబడిన వారు గనుక మీ దేహముతో దేవుని మహిమ పరచుడి " (1కొరింధీ 6:19-20). దేవుడు మనల్ని పిలిచారు గనుక మనం ఆయనకు చెంధిన వారము.(యెషయా 43:1). మాసిదోనియా వారు తమ్మునుతాము మొదట దేవునికి సమర్పించుకొన్నారు గనుక వారిలో దాతృత్వము బహుగా విస్తరించెనని పౌలు చెప్పాడు (2 కొరింధీ 8:5).

**మంచి దాసుడు తన యజమానుని ఘనపరచును:**

మంచిదాసుడు తన యజయానునికి లాభము సంపాదించును. అద్దెకున్న వారు యింటి అద్దిని పూర్తిగా ఆ యింటి యజమానికి చెల్లిస్తారు. అంటే ఆ యిల్లు వారిది కాదని వారు సంతృప్తిగ ఒప్పుకొనుచున్నారు. మంచిదాసుడు తన రాబడిలో ప్రధమ ఫలమును ఆస్తిలో భాగమును ఇచ్చి దేవుని ఘనపరచును (సామె 3:9). మంచిదానుడు తన ప్రభువుకు ఎంతయిస్తాడు? తనకున్నదంతయు దేవునిదే యని అతడు జ్ఞావకముంచుకోవాలి. యూదులు తమ దశమ భాగమునియ్యాలని దేవుడు కోరారు. మనం ధర్మశాస్త్రము వలన గాక కృపవలన జీవించుచున్నాము. యూదులకంటే మనం ఎక్కువ ఇయ్యబాధ్యులం.

దేవుని ప్రజలు ధారాళముగా దేవునికిచ్చుటలో వెనుకబడినప్పుడు వారు ఆత్మీయ, ఆర్థిక క్లిష్ట పరిస్థితుల నెదుర్కొన్నారు " మానవుడు దేవుని యొద్ద దొంగిలునా? అయితే మీరు నా యొద్ద దొంగిలితిరి. దేని విషయములో మేము నీ యొద్ద దొంగిలితి మని మీరందురు? పదియవ భాగమును ప్రతిష్టార్పణములను ఇయ్యక దొంగిలితిరి. ఈజనులందరు నాయొద్ద దొంగిలుచనే యున్నారు . మీరు శాపగ్రస్తులైయు న్నారు" (మలాకీ 3:8,9). నెహెమ్యా 13:10-12). కూడ చదువండి.

అట్లుండగా మానవుడు దేవునికిచ్చు కాలారంభమునుండి నేటి వరకు కూడ మానవుడు దేవునికి

ధారాళముగ యిచ్చినప్పుడాయన వారిని ఆత్మీయముగను, ఆర్థికము గాను కూడ ఆశీర్వదించారు. "అప్పుడు మెల్కీసెదెకు అబ్రామును అశీర్వదించి – అకాశమునకు భూమికి సృష్టికర్తయును, సర్వోన్నతుడునైన దేవుని వలన అబ్రాము ఆశీర్వదింప బడును గాక అని పలికెను" (ఆదికా 14:19). "ప్రధాన యాజకుడగు అజర్యా యెహోవా మందిరములోనికి జనులు కానుకలు తెచ్చుట మొదలు పెట్టిన నాటినుండి మేము సమృద్ధిగా భోజనము చేసినను చాల మిగులుచున్నది. యెహోవా తన జనులను ఆశీర్వదించి నందున ఇంత గొప్పరాశి మిగిలినదని రాజుతో చెప్పెను" (2 దినవృ 31:10).

మంచిదాసుడు పదియవ వంతుతో ఆరంభించి ఆ వంతును పెంచుతు దేవుని కిచ్చును. దేవుడతని నాశీర్వదించారు గనుక దశమ భాగము కంటే ఎంతో ఎక్కువ ఇచ్చును. అతడు తన్ను తానే దేవునికి సమర్పించుకొనును (రోమా 12:1). మంచిదాసుడు స్వల్పములో కూడ నమ్మకముగా యుండును:

"మిక్కిలి కొంచెములో నమ్మకముగా యుండువాడు ఎక్కువ లోను నమ్మకముగా యుండును. మిక్కిలికొంచెములో అన్యాయ ముగా ఉండువాడుఎక్కువలోను అన్యాయ ముగా ఉండును" (లూకా 16:10). కొంచెమున్నా, ఎక్కువ యున్నా, నమ్మకమైన దాసుడు తన బాధ్యత నెరిగి ప్రవర్తించును. మనకున్న దంతయు దేవునికే చెందును. ఆయనకు మనం లెక్క అప్పగించాలి. మనమంద రము మంచి దాసులుగా యుండుటకు ప్రయత్నించాలి. "భళా, నమ్మకమైన మంచిదానుడా'' యని ఆయన మనలను గూర్చి చెప్పేలాగు జీవించాలి!!

V.P. బ్లేక్

**దేవుని రుజువులు -5**

# జీవ శాస్త్రంలో దేవుని రుజువు
## (Evidence of God in Biology)

ఈ విశ్వం నిత్యం కాదని ఇంతవరకు మనం గ్రహించాము. దానికొక ఆదియున్నది. దాని నిర్మాణ పద్ధతి జ్ఞానయుక్తమైనది. భూమ్యా కాశములు జీవమునకను కూలముగా యుండు నట్లుకడు జాగ్రత్తగా సంకల్పించ బడినవి.

అట్లే జీవకణము ఎంత జటిలమైనదంటే, అది దానికదే కాలముల తరబడి పరిణామము జెంది యుండలేదు అని కూడ గ్రహించాము. ఈ పాఠములో మృగ వృక్ష ప్రపంచములో యున్న నిర్మాణ పద్ధతిని గమనించుదము.

**సహజీవన సంబంధములు (Symbiotic Relationships ) :**

Symbioun అను గ్రీకు పదము నుండి Symbiotic అను పదము వచ్చినది. అనగా సహజీ వనము అని అర్థము. కొన్ని జంతువులు ఎంత కలిసి జీవిస్తాయంటే ఒకటి లేకుండా మరొకటి జీవించలేదు!

**యుక్కా చెట్టు, యుక్కా పురుగు (The yucca Plant and Yucca Moth):**

యుక్కా చెట్టు, యుక్కా పురుగు రెండు సన్నిహిత సంబంధము కలిగి జీవించుచున్నవి. ఒకటి లేకుండా రెండోదియుండదు. రకరకాల యుక్కాలున్నవి. అవన్నీ ఉత్తర అమెరికాలోని ఎడారు లలోను, మధ్య అమెరికాలోను కొన్ని కెనడా లోను కనబడును. యుక్కా చెట్టులన్నియు ఒకే విధముగా సంపర్కము జెందును. అవన్ని ఆడ యుక్కా పురుగుల వలన సంపర్కము జెందును. మే నెల చివరి భాగములోను, జూన్‌లోను యుక్కాచెట్లు పూలు పూయును. అదే సమయమునందు భూమిలో నుండి బయటకు వచ్చు యుక్కా పురుగులు ఆ చెట్లు మీద గంటల ఆకారములో యున్న తెల్లటి పువ్వుల యొద్దకు ఆకర్షింపబడును. ఆ పువ్వులలో ఆడ మగ యుక్కా పురుగులు సంయోగించును. తదుపరి మగ పురుగు చచ్చును. తెల్లటి యుక్కా పువ్వులు క్రిందికవ్రేలాడుచుయుండును. ఆ పువ్వులో ఆడ భాగము (the Pistil) మగభాగము కన్నా (Stamen) లోతులోయుండును. పిప్పొడిని (Pollen) స్వీకరించు ఆడభాగము ఎట్లు నిర్మించబడినదంటే మగభాగము తయారు చేసిన పిప్పొడి దానిలో పడదు. అయితే యుక్కా పురుగు లేకుండా యుక్కా చెట్టు ఉత్పత్తి జెందదు. యుక్కా పురుగు గుడ్లు పెట్టే సరికి, సూర్యుడస్తమించిన తరువాత దాని పని ప్రారంభించును. అది యుక్కా పువ్వులోని మగభాగముల (Stamen) నుండి పిప్పొడిని స్వీకరించి తన నోటిలో యుంచుకొనును. తదుపరి అది వేరొక పువ్వు దగ్గరకుపోయి ఆడభాగములో (Pistil) రంధ్రము చేసి తన గుడ్లను అక్కడ యుంచును. చివరికి అది పిస్టిల్‌లో నుండి ప్రాకి బయటకి వచ్చి స్టిగ్మాలో పిప్పొడిని ఫెర్టిలైజేషన్ కొరకు ఉంచును.

తరువాత యుక్కా యొక్క అనేక విత్తనములను తయారు చేయును. ఆ విత్తనాల్లో కొన్నిటిని యుక్కా సూక్ష్మ పురుగులు తినివేయును, మిగతావి భూమి మీదపడి క్రొత్త మొక్కలగును.

ఆ పురుగు యొక్క గుడ్లు పొదగబగుచున్నప్పుడవి అచెట్టు యొక్క 300 విత్తనాలలోను 20 విత్తనాలు తినును. తరువాత అవి ఆ విత్తనము లోనికి చొచ్చుకొనిపోయి, నేల మీదపడి, కప్పబడి, కొన్నినెలల తరువాత బయటకి వచ్చును. ఈ రీతిగ ఈ చక్రము తిరుగుచు యుండును.

ప్రకృతిలో యిది ఆశ్చర్య కరమైన పాఠము. యుక్కా పురుగు ఆ మొక్క నుండి పొందే లాభము యేది లేదు. తాను తినని పిప్పొడిని సేకరించి యుక్కా పుష్పము యొక్క పిస్టిల్‌లో యుంచును. తద్వారా యుక్కా విత్తనములు తయారగును. ఆ విత్తనములు యుక్కా పురుగు యొక్క లార్వా దశలోయున్న పురుగులను పోషించును. ఆ విత్తనముల ద్వారా యుక్కా మొలకెత్తును.

వాటి మనుగడ కొరకు యుక్కా పురుగు, యుక్కా మొక్క కూడ ఒక దానిపై అకటి ఆధారపడును. వాటి సహజీవన సంబంధము జ్ఞానయుక్తమైన సంకల్పమును. నిర్మాణ పద్ధతిని సూచించుచున్నది.

**చీమలు, పుట్ట గొడుగులు, ఆకులు సూక్ష్మజీవులు :**

సహజీవన సంబంధమును సూచించు ఆశ్చర్యకరమైన ఉదాహరణ దక్షిణ అమెరికాలో కనబడును. అక్కడ ఆకులు తినుచీమలు పుట్టగొడు గుల్లాంటి కోలనీలను ఆహారము కొరకు నిర్మిస్తాయి. అవి ఆ పుట్టగొడుగులను నేలమీదకాక కుళ్లిన ఆకులపై నిర్మిస్తాయి.

ఈ చీమలు ఆకులు కత్తిరించునవని (Leaf Cutters) పిలువబడ్డాయి. యివి చెట్ల మీద నున్న ఆకుల్నను ముక్క ముక్కలుగా కత్తిరించి నేల క్రింది భాగములోనికి మోసుకొని పోతాయి. అక్కడ అవి పుట్టలు పెడ్తాయి. అవి మోసుకొనిపోవు ఆకులను ఆ చీమలు తినవు. ఆ ఆకులను జీర్ణించుకొనే శక్తి వాటికి లేదు. గాని అవి ఆకులను పోగుచేసి, వాటి పుట్టలలో యున్న ఫంగస్ చుట్టూ వాటిని పరుస్తాయి. ఆ ఫంగస్ వాటిలోని పోషక పదార్థములను సంగ్రహించు కొంటాది. ఆ చీమలు ఆ ఫంగస్‌ను తింటాయి.

ఆకులు కొరకు చీమలు తోటమాలివలె పనిచేస్తాయి. ఫంగస్‌ను ఒక పుట్టనుండి మరొక పుట్టకు మార్చుతుయుంటాయి. ఆ ఫంగస్ పెద్ద పుట్టగొడుగులా పెరుగకుండా అవి వాటి సైజును తగ్గిస్తు యుంటాయి. పనికిరాని ఫంగస్‌ను అవి కలుపుతీసి బయట పారవేస్తాయి. చీమలు ఫంగస్ మీద, ఫంగస్ చీమల మీద ఆధారపడి పనిచేస్తాయి. ఒకటి లేకుండా మరొకటి జీవించదు.

ఈ సహజీవన సంబంధములో మూడవ పాత్రధారి కూడ యున్నది. అది పేరాసైటిక్‌మోల్డ్,

ఈమోల్డ్ ఫంగస్ తోటను 24 గంటల వ్యవధిలో నాశనం చేయును. గాని చీమలు వాటి శరీరముపై బేక్టీరియాకు విరుద్ధముగా యున్న ఔషధాన్ని ఎల్లవేళలా ఉంచుకొంటాయి. ఈ ఏంటీ బాక్టీరియా ఆ మోల్డ్‌ను నాశనం చేయును.

ఈ రీతిగ జీవించడానికి బేక్టీరియా చీమలపై ఆధారపడును. చీమలు పుట్టగొడుగులపై ఆధార పడును. ఈ పుట్టగొడుగులు చీమలు, బేక్టీరియాపై ఆధారపడును. ఈ గుంపులో ఏ ఒక్కదానిని తీసివేసినా, ఆదంతయు నాశనమగును.

చీమలు, ఫంగస్, బేక్టిరియా, మొక్కలు మొదలైనవన్నీ కలిసి పరిణామము జెందెనని కొందరు తలంచుదురు. ఇంగితజ్ఞాన లక్షణ ములు జన్మత వచ్చును. అవి నేర్చు కొనినవి కావు.

**ఇంగిత జ్ఞానము :**

నీటను నేలను కూడ సంచరించు బీవర్ అను జంతువులకు చెట్లు నరికి, వంతెనలు నిర్మించి, పుల్లముక్కలతో ఇండ్లు కట్టుకొనుట- ఎవరు నేర్పించారు? మైనమును, తేనెను తయారు చేయడం తేనీటీగల కెవరు నేర్పించారు? సాలె పురుగులు తమ ఆహారమును పట్టుకొనుటకు గూళ్లు కట్టడం వారికెవరు బోధించారు? యీల్ అనే చేపలు అట్లాంటిక్ మహాసముద్ర మును దాటుకుంటూ యూరపు వరకు వెళ్లి మరల తిరిగి వచ్చును. వాటికా సంగతి ఎవరు నేర్పారు? కొన్ని పక్షులు సూర్యుని బట్టి ఆకాశ మైదానములో ఎగురును, కెనడా బాతుల యూరోపియన్ వార్బ్లర్స్ చంద్రుని బట్టి ఎగురును, వాటికా విద్యను ఎవరు నేర్పించారు?

సాల్మన్ (వంజరము) చేపలకు సముద్రములోనికి ఈదుకొనిపోయా అవి గుడ్లు పెట్టే వరకు ఆహారము తిని మరల అవి ఏ నదిలో నుండి వెళ్లెనో అక్కడికే తిరిగి వచ్చి పిల్లలను పెట్టు జ్ఞానమును ఎవరు నేర్పారు?

పక్షులు, తిమింగలములు, తాబేళ్లు తుఫాను వాతావరణములో అవి ఎన్నడు ఎరుగని వేలకొలది మైళ్లు పయనిస్తాయి. అవి మరల తమ మొదటి స్థానానికి తిరిగి చేరుకొంటాయి. అవి బాల్య దశలోనే తమ స్థానమును విడిచినా, మరల అక్కడికే ఎట్లు చేరుకొంటాయి?

షడ్భుజ నిర్మాణము చాల శక్తివంత మనదని ఇంజనీర్లు చెబుతారు. ఆ సంగతి తేనెటీగకు ఎట్లు తెలుసు? కాలారంభము నుండి తేనెటీగల పట్టు షడ్భుజాకారములోనే యున్నది.

కంగారూ జంతువును ఆలోచించుము. అది గర్భమందుపడిన

కొన్ని వారములకే, పిండము గర్భాశయమును వీడి తల్లి పొట్టదిగువ భాగమునున్న సంచిలోనికి ప్రవేశించి పాలుకుడుచుటకు ప్రారంభించును.

అది ఒక అంగుళము కంటె తక్కువ సైజులోయుండి, ఇంకా గ్రుడ్డిగా యుండగానే ఆ పిండము తల్లి సహాయము లేకుండగనే ప్రమాదకర ప్రయాణము చేయును. కంగారూ పిండము అట్టి ప్రమాదభరిత ప్రయాణము నెందుకు చేయును? ఆ పిండము ఇంగిత లక్షణములను బట్టి పనిచేయును, మత్స్యములలోను, పక్షులలోను, మృగములలోను యున్న ఇంగిత జ్ఞానము జ్ఞానియైన నిర్మాణకుని సూచించుచున్నది,

**రాడారు : (Radar)**

రెండవ ప్రపంచ యుద్ధకాలములో శాస్త్రజ్ఞులు రాడారు అను ఒక ప్రాముఖ్య యుద్ధ పరికరమును తయారుచేసారు. నేటికిని అది ప్రాముఖ్యపాత్ర వహించుచున్నది. రాడారు సహాయము వలన ఓడలు, విమానములు ఒక దానితోనొకటి గుద్దుకొనకుండుటకు వీలగుచున్నది. మరియు దాని వలన తుఫానుల జాడను కూడ పర్యవేక్షించుటకు వీలుపడుచున్నది. రాడారును తయారు చేయడం మానవులు సాధించిన గొప్ప సంగతే గాని గబ్బిలములు, తిమింగిలములు పోర్పోయిజ్ చేపలు మొదలగునవి వేలకొలది సంవత్సరముల నుండే ఇట్టి రాడర్ విధానము కలిగి యున్నవి. వీటి యొక్క రాడార్ విధానము దానికదే కలిగెనా? కానేకాదు. అది దానిని నిర్మించిన జ్ఞానియొక్క కృషిని సూచించుచున్నది. ఆయనను దేవుడని బైబిలు చెప్పుచున్నది.

**ముగింపు :**

వృక్షములు, జంతువులు ఒకదానిపై నొకటి ఆధారపడి జీవించు విధానము వాటిని అట్లు కలుగజేసిన సృష్టికర్తను సూచించుచున్నవి. మత్స్యములలోను, మృగములలోను, ఆకాశపక్షులలోను యున్న ఇంగిత లక్షణములు వాటిని సృజించిన అమితజ్ఞానిని సూచించుచున్నవి.

"దేవుడు జీవము కలిగి చలించు వాటిని జలములు సమృద్ధిగా పుట్టించును గాకనియు, పక్షులు భూమిపైని ఆకాశ విశాలములో ఎగురుగాకనియు పలికెను. దేవుడు జలములలో వాటి వాటి జాతి ప్రకారము 'జలములు సమృద్ధిగా పుట్టించిన మహామత్స్యములను, జీవము కలిగి చలించువాటి నన్నిటిని దాని దాని జాతి ప్రకారము రెక్కలు గల ప్రతి పక్షిని సృజించెను. అది మంచిదని దేవుడు చూచెను" (ఆదికా 1:20-21).

# యేసు ఎవరు?

## (Who is Jesus)

ఇప్పటికి రెండు వేలసంవత్సరములకు పైగా ప్రజలు ఈయేసు ఎవరు? అని ప్రశ్నించుచున్నారు. యేసు యెరూష లేములోనికి వచ్చినప్పుడు "పట్టణమంతయు - ఆయన ఎవరోయని కలవర పడెనని" మత్తయి చెప్పుచున్నాడు (మత్త 21:10). గలిలయ సముద్రపై యేసు తన శిష్యులతో కలిసి ఒక దోనెలో యుండెనొకసారి. వారొక భయంకర తుఫానులో చిక్కుకొనిరి. సముద్రములో పడిగల్లంతయ్యే ప్రమాద ములో చిక్కుకొనిరి, గాని యేసులేచి గాలిని సముద్రమును గద్దింపగా అవినిమ్మళ మాయెను "వారు మిక్కిలి భయపడి - ఈయన ఎవరో, గాలియూ సముద్ర మును ఈయనకు లోబడుచున్నవని ఒకనితో నొకడుచెప్పుకొనిరి" (మార్కు 4:41). గనుక ఈ యేసు ఎవరో బైబిలు నుండి జవాబును కనుగొనుటకు ప్రయత్నించుదము.

**యేసు దేవుని కుమారుడు :**

యేసు జీవితచరిత్రను వ్రాయుచు యోహాను యేసు ఎవరో కాదుగాని దేవుడే యని దానిని ప్రారంభించాడు, "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను, వాక్యము దేవుడైయుండెనని"అతడు తను వ్రాసిన సువార్త నారంభించెను (యోహాను 1:1). ఆవాక్యమే యేసు (14,18 వచనము). ఆదియందు ఆయన దేవునితో యుండుట మాత్రమే గాక, వాక్యమైన దేవుడై యుండెను! (యోహాను 1:2). యేసు చేసిన అద్భుతము లను గూర్చి యోహాను వ్రాస్తు వాటిని గూర్చి చదువువారు "యేసు దేవుని కుమారుడని నమ్మునట్లు" అతడు వ్రాసెనని కూడా యోహాను చెప్పుచున్నాడు (యోహాను 20:30-31). ఆయన చేసిన సూచక క్రియల యొక్క సాక్ష్యము నిజంగా బ్రహ్మాండమైనది. యేసు చనిపోయిన వారిని బ్రదికించడము, దయ్యములను వెళ్లగొట్టడము, గ్రుడ్డివారికి చూపుని య్యడం. కుంటివారు నడువశక్తి నీయడం, ఆయనే నీళ్లమీద నడువడము మొదలగు వాటిని గూర్చి కూడా యోహాను మనకు తెలియజేయుచున్నాడు.

యేసు యొక్క దైవత్వాన్ని గూర్చిన మరికొంత సాక్ష్యము బాప్తిస్మమిచ్చు యోహాను యిచ్చుచున్నాడు. "ఈయనే దేవుని కుమారుడని నేను తెలిసికొని సాక్ష్యమిచ్చితినని" అతడు చెప్పాడు (యోహాను 1:34). యోహాను చేత యేసు బాప్తిస్మము పొందినప్పుడు పరిశుద్ధాత్మ పావురమువలె ఆయనపై

దిగుటయు, మరల ఆయనే నాప్రియ కుమారడనే శబ్దము ఆకాశము నుండి వచ్చుటయు గమనించి అతడు మనకు సాక్ష్యమిచ్చాడు (మార్కు 1:9-11).

చివరిగా పైన చూచుకొనినట్లు పరమందున్న దేవుడే యేసు తన ప్రియ కుమారుడని సాక్ష్యమిచ్చారు. ఈ రీతిగా యేసు నిజమైన దేవుని కుమారుడని లేఖనములు విపులీకరించుచున్నవి.

**యేసు మన క్రయధనము**

యోహాను తాను చూచిన పరలోక దృశ్యాన్ని గూర్చి మనకు తెలియజేయు చున్నాడు. వారొక క్రొత్త కీర్తన పాడిరి. "నీవు ఆగ్రంధమును తీసికొని దాని ముద్రలను విప్పుటకు యోగ్యుడవు. నీవు వధింపబడిన వాడవై నీ రక్తమిచ్చి ప్రతి వంశములోను, ఆయాభాషలు మాటలాడు వారిలోను ప్రతి ప్రజలోను ప్రతి జనములోను దేవుని కొరకు మనుష్యులనుకొని మా దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులనుగాను చేసితివి; గనుక వారు భూలోకమందు ఏలుదురని క్రొత్తపాట పాడుచుండిరి" (ప్రకటన 5:9-10).

యేసు తాను ఈ లోకమునకు పాపపరిహారార్ధబలిగా అర్పింపబడుటకు వచ్చితినని తన శిష్యులతో చెప్పెను. "మనుష్య కుమారుడు పరిచారము చేయించు కొనుటకు రాలేదుగాని పరిచారము చేయుట కును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెనని" యేసుతన శిష్యులకు చెప్పెను (మార్కు 10:45).

**యేసు మన తీర్పరి :**

యేసు మనకొరకు చనిపోయెనను వాస్తవము మనకొక తీవ్రమైన బాధ్యతను కల్పించుచున్నది. మనం ఇక మీదట క్రీస్తుకే గాని మరెవనికిని చెందము (1కొరింథీ 6:19-20). మనం ఆయనకు చెందితే, ఆయనకు విధేయత చూపుటకు ఇష్టపడాలి. ఆయన మనకొరకు చనిపోయెను, మన తీర్పరి గనుక యిది న్యాయపరమైన కోరికయే.

"ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచి వైనను సరే చెడ్డవైనను సరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడు పొందునట్లు మన మందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును " (2 కొరింథీ 5:10). ఈరోజు మనం యేమి చేసినా నీతి గల న్యాయాధి పతియైన యేసు ఎదుట దానిని గూర్చి లెక్క యొప్పగించవలసినదే.

మన తీర్పుస్థాయి ఇప్పటికే నిర్ధారించబడినది. అది దేవుని వాక్యమైన బైబిలు "ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలము గలదై

రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్లను మూలుగను విభజించు నంతమట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది. మరియు ఆయన దృష్టికి కనబడని సృష్టము ఏదియు లేదు. మన మెవనికి లెక్క యొప్ప చెప్పవలసి యున్నదో ఆ దేవుని కన్నులకు సమస్తమును మరుగు లేక తేటగా ఉన్నది" (హెబ్రీ 4:12-13).

ఈ లేఖకుడు మనకురెండు సంగతులు చెప్పుచున్నాడు. మొదటిగా దేవుని వాక్యము న్యాయము తీర్చే పరికరము. రెండవది ఆపరికరాన్ని వినియోగించువాడు యేసు. ఆయనకు మనం లెక్క యొప్పగించ వలసి యున్నది. తీర్పరిగా యేసును యోహాను ప్రకటన 1:16లో చిత్రీకరించాడు: "ఆయన తన కుడి చేత ఏడు నక్షత్రములు పట్టుకొని యుండెను; ఆయన నోసటనుండి రెండంచులుగల వాడియైన ఖడ్గమొకటి బయలు వెడలు చుండెను". అది తీర్పు తీర్చు ఖడ్గము, అదిదేవుని వాక్యము.

ఈ మూడు అంశములే గాక యేసును గూర్చి క్రొత్త నిబంధన బోలెడు చెబుతున్నది. ఈ సంగతుల సత్యముల నొకడు గ్రహించకపోతే అతడు యేసును గూర్చి ఎక్కువ తెలిసికొనలేదు. యేసు దేవుని కుమారుడు మన పాపముల అపరాధ రుసుమును ఆయనే చెల్లించారు. యేసు మన తీర్పరి.

యేసు ఎవరు? యిదే నీ ప్రశ్న అయితే దానికి జవాబీయబడి యున్నది. బైబిలును పరిశోధించుము. యేసును గూర్చి అదిబయలు పరచు సత్యములను గ్రహించుము. అప్పుడీ ప్రశ్నకు జవాబీయుము "నీవు యేసును ఎరుగుదువా?

**బిల్లీ ఫిల్లీక్** - బాబీ వీట్


**వధువు కావలెను**

| | |
|---|---|
| వరుని పుట్టిన తేది | : జూన్ 1980 |
| ఎత్తు | 5' 8" |
| చదువు | : B.Com M.B.A. |
| ఉద్యోగం | : Shipping Catering Service |
| వరుని పుట్టిన తేదీ | : జూన్ 1981 |
| ఎత్తు | : 6'.0" |
| చదువు | :M.A. & M.B.A. |
| ఉద్యోగం | : కాకినాడ M.B.A. కాలేజీ లెక్చరర్ |

**వరుడు కావలెను**

| | |
|---|---|
| వధువు పుట్టిన తేది : | మే 1986 |
| ఎత్తు : | 5' - 7" |
| చదువు : | MSc |

**Contact :**
9393750047
9705684466

క్రీస్తు సంఘస్థులయితే మంచిది.

# యేసుకాలము నాటి యూదుల మతశాఖలు

(Jewish Sects of Jesus time)

మొదటి శతాబ్ధములో యూదులు నేటి క్రైస్తవులవలె శాఖలై విడిపోయియుండిరి. సిద్ధాంతములలోను ఆచరణ లోను వారు వివిధ శాఖలుగా నుండిరి. గాని యేసు మాత్రం ఏ శాఖలోను లేరు, వారిని సమర్ధించ లేదు. ఆనాటి యూదుల శాఖలుద్భవించడం ఆయాశాఖలలోని ప్రత్యేకత లను గ్రహించుకో వాలంటే, నిబంధనల మధ్య కాలములో జరిగిన సంఘటనల నెరుగుట ముఖ్యము. అంటే పాతనిబంధనలో ఆఖరి పుస్తకము వ్రాయబడిన నాటి నుండి క్రీస్తు ఈ లోకంలో అవతరించిన సమయము అది. నిబంధనల మధ్య కాలములో యూదా జనాంగము మత పరము గాను, రాజకీయము గాను కూడ పలు మార్పులకు గురియైనది. తరచు మారుచున్న రాజకీయ వాతావరణ మును బట్టి వారు తమ మతపరమైన గుర్తింపును తిరిగి స్థాపించుకోడానికి యత్నించుచుండిరి.

ఆ కాలములో ఆత్మావేశము గల ప్రవక్తలు, లేఖకులు లేనందున, యూదా జనాంగముకు మోషే ధర్మశాస్త్ర జ్ఞానమును, ఆచరణను పునరుద్ధ రించ డానికి వారు ప్రయత్నము చేసారు. ఈ ప్రయత్నములో శాస్త్రులు ఎక్కువ ప్రాధాన్యత బొందిరి. ఏలయనగా వారు లేఖనములను చేవ్రాతతో కాపీ చేయుచు, ధర్మశాస్త్ర జ్ఞానము కలిగియుండి ప్రజలను వాక్యములో తిరిగి విద్యావంతులుగా చేసేవారు. కొంతకాలము గడుచరికి శాస్త్రులు విద్యావేత్తలై ధర్మశాస్త్ర విషయము లలో ప్రవీణులైరి. ధర్మశాస్త్రము నవలంబిం చుటను గూర్చివారు వక్కాణించిరి. మరియు జీవితంలో ప్రతి చిన్న విషయానిని ధర్మశాస్త్ర మును బట్టి వీక్షించేవారు . తరచు దానికి క్రొత్త సంగతులు చేర్చేవారు. తత్ఫలితముగా లిఖితపూర్వకమైన ధర్మశాస్త్రముతో (Oral Law) వాక్పూర్వక ధర్మశాస్త్రము ఉద్భవించెను. నిబంధనల మధ్యకాలములో సంభవించిన రాజకీయ సంఘటనలు యూదుల ఆలోచన సరళిపై గొప్ప ప్రభావము చూపెను. అలెగ్జాండరు చక్రవర్తి ప్రవేశపెట్టిన గ్రీకు సంస్కృతి అందులో భాగమై యుండెను. అతడు గొప్ప భూ భాగములను జయించుట యేగాక, అయా ప్రజల పద్ధతులను

సంస్కృతులను గ్రీకు పద్ధతులు గాను సంస్కృతి గాను మార్చివేసెను.

**పరిసయ్యులు :**

యేసు కాలములో యున్న గుంపులలో మొదట పరిసయ్యులను గమనించుదాం. పరిసయ్యుడు అనగా ప్రత్యేకపరచబడిన వాడనియర్థము. పరిసయ్యులలో శాస్త్రులు, మోషే ధర్మశాస్త్రమునకు, వాక్పూర్వక సంప్రదాయములకు పూర్తిగా కట్టుబడి యున్నవారు ఉండేవారు. గ్రీకు సంస్కృతిని ప్రవేశపెట్టుట వలన అది యూదుల నమ్మకత్వాన్ని కలుషితం చేయునని వారు తలంచేవారు. అందువలన ప్రజలు విదేశీశక్తులను ఎదిరించాలని, మోషే ధర్మశాస్త్రమునకు పారంపర్యాచారములకు పూర్తిగా కట్టుబడి యుండాలని వారు బోధించేవారు.

ఇతరులతో సమానమైన కొన్ని నమ్మకములు వారికి వుండేవి. ఉదా: దేవ దూతల ఉనికిని, మృతుల పునరుత్థాన మును వారు నమ్మేవారు. అయితే వారి మతఛాందస్యము వలన ధర్మశాస్త్రమును మీరి పనిచేయుచున్నారేమియని వారు యేసును ప్రశ్నించారు. వారి ప్రశ్ననిజానికి ఆరోగ్య సూత్రమును గూర్చి కాదు. యేసు వారికిట్లు జవాబిచ్చారు. "మీరును మీ పారం పర్యాచారము నిమిత్తమై దేవుని ఆజ్ఞను ఎందుకు అతిక్రమించు చున్నారు? మీ పారంపర్యా చారము నిమిత్తమై దేవుని వాక్యమును నిరర్థకము చేయు చున్నారు. మనుష్యులు కల్పించిన పద్ధతులు దైవోపదేశములని బోధించుచు వారు నన్ను వ్యర్థముగా ఆరాధించు చున్నారు" (మత్తయి 15:4-9). యేసు ఒక పరిసయ్యుడు కాదు. దేవుని వలనకలుగని ఆజ్ఞలకు తాను గాని, తన అనుచరులు కాని బద్ధులు కాకుండుటకు ఆయన చూచెను. పారంపార్యాచారములను దేవుని వాక్యముతో సమానముగా ఎంచుటయే పరిసయ్యుల లక్షణము.

**సద్దూకయ్యులు :**

సద్దూకయ్యులు గుంపులో ముఖ్యముగా ధనవంతులును, యాజకులునువుండేవారు. వీరు మోషే ధర్మశాస్త్రమును గౌరవించే వారు గాని పరిసయ్యుల పారంపర్యా చారములను తిరస్కరించే వారు. అందువలన ఈ రెండు గుంపులు మధ్య గొప్ప విభేదముండేది. మరియు సద్దూకయ్యులు గ్రీకు సంస్కృతిని ఆహ్వానించారు, విదేశీయుల స్నేహము కొరకు అవసరమయితే ధర్మశాస్త్రాన్ని ప్రక్కనబెట్టేవారు. వారు మతము కంటే రాజకీయము కొరకు ఆసక్తిగలవారు. రాజకీయ లబ్ధికొరకు ధర్మశాస్త్రాన్ని ధిక్కరించేవారు.

యేసు తానే క్రీస్తునని చెప్పుకొనే

వరకు సద్దూకయ్యులు ఆయనను పెద్దగా పట్టించు కోలేదు. తానే మెస్సీయనని యేసు చెప్పుకొన గానే, పరిసయ్యులు అందోళన జెందారు. ఏలయనగా రోమీయులు ఈ "యూదుల రాజును"సహించరు గనుక వారి రాజకీయ పరిస్థితి తారుమారు కాగలదు.

యేసు తాన మెస్సీయను అని చెప్పుకొనే వరకు సద్దూకయ్యులు యేసును గూర్చి ఆసక్తి లేనివారు. యేసు ఒక సద్దూకయ్యుడు కాదు. మానవులతో సహవాసము కొరకు ఆయన దేవుని ఆజ్ఞను ఎన్నడు ఉపేక్షించరు. ఆయన ఉద్దేశ్యము ఆత్మీయముగాని రాజకీయము కాదు, ఇహసంబంధం కాదు.

**జెలోతేలు** :

యూదులలో మూడవ గుంపు జెలోతేలు. వారిని యూదా జాతీయపార్టీ అని మనం చెప్పుకోవచ్చును. క్రీ॥పూ॥ 63లో రోమీయులు యూదయను పాలించక ముందు యూదులు కొంతమట్టుకు స్వాతంత్ర్యము ననుభవించిరి. స్వాతం త్ర్యము పొంది, దానిని పోగొట్టు కొనుటచేతను, పరిసయ్యుల పవిత్ర నిష్ఠ వలనను అనేకులు మెస్సీయ వచ్చి విదేశీపాలన నుండి వారిని విముక్తి చేయుననే భావన కలిగియుండిరి. స్వాతంత్ర్యము కొరకు నిష్ఠతో పోరాడే వారిలో నుండే మెస్సీయ వచ్చునని కొందరు యూదులు భావించిరి. అట్టివారే జెలోతేలు.

కాలము గడుచుకొలదీ ఈ జెలోతేలు స్వాతంత్రము కొరకు హింసాత్మకముగా తయారయ్యారు. రోమీయులను పారద్రోలడానికి వారు హింసనొక సాధనముగా ఎంచు కొన్నారు. యేసుతో సిలువ వేయబడిన ఇద్దరు దొంగలు, విడుదల పొందిన బరబ్బా కూడా జెలోతేలే. యేసు యొక్క అపోస్తులులలో ఒకడైన జెలోతే అనబడిన సీమోను వున్నాడు.

యేసు ఒక జెలోతే కాదు. భౌతిక రాజుగా అయనను ప్రతిష్టం చుటకు ప్రజలు చేసిన ప్రయత్నాలతో ఆయన ఏకీభవించలేదు (యోహాను 6). తదుపరి ఆయన రాజ్యము ఇహలోక సంబంధమైనది కాదని యేసు పిలాతుకు కూడ చెప్పారు (యోహాను 18:36).

మొదటి శతాబ్దములో యూదులలో ఇంకా కొన్ని గుంపు లుండేవి. గాని క్రొత్త నిబంధనలో పెక్కుసార్లు పైన చెప్పబడిన మూడు గుంపులు తరచు కనబడతాయి. యేసు యూదుల కొక భావ స్వారూప్యా న్నిచ్చుటకు ఈ గుంపులలో దేనికీ చెందినవాడు కాదు. పరిసయ్యులు దేవుని ధర్మశాస్త్రముకు కలుపుటను ఆయన వ్యతిరేకించారు. లోకసంబంధ లాభము కొరకు సద్దూకయ్యులు ఉ

పేక్షించుచున్న ధర్మశాస్త్రాన్ని ఆయన పైకెత్తారు. జెలోతేలు కాంక్షించుచున్న లోక సంబంధ రాజ్యమును స్థాపించుటకు ఆయన రాలేదు.

అయితే యేసు ఎవరు? ఆయన ఒక యూదుడు. ధర్మశాస్త్రాన్ని ఆయన పరిపూర్ణముగా పాటించారు. దేవుడు బంధించని చోట ఆయన బంధించలేదు, "నన్ను పంపిన వాడు నాకు తోడైయున్నాడు; ఆయన కిష్టమైన కార్యము నేనెల్లప్పుడు చేయుదును గనుక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదని" ఆయన చెప్పెను (యోహాను 8:29).

సంఘములో నేడు ఆధునిక పరిసయ్యులు వలెపనిచేయువారున్నారు. దేవుడు బంధించని సంగతులు వారు ప్రజలపై బంధిస్తారు. మానవ చట్టాలను సువార్తకు అంటగట్టి వాటికి లోబడాలంటారు. అదే రీతిగా ఆధునిక సద్దూకయ్యులు కూడ సంఘములో యున్నారు, కొందరు ఈలోక సాంగత్యము కొరకు దేవుని వాక్యాన్ని ప్రక్కన బెట్టి తమకిష్ట మొచ్చినట్లు ప్రవర్తిస్తారు. సువార్తను నిర్లక్ష్యము చేస్తు దానిని వారికి జ్ఞాపకము చేయువారిని సంకుచిత స్వభావము గలవారంటారు. మరల, యేసువచ్చి యెరూషలేములో తన సింహాసనము పై నుండి ఈ భూమిని పాలిస్తారనే జెలోతేలు మన మధ్యలేకపోలేదు.

మనం ఈ గుంపులలో చేరక యేసు వలె దేవునికి మాత్రమే చెందిన వారముగా యుండాలి. క్రైస్తవులుగా మాత్రమే యుండాలి. ఆయన చిత్తాన్ని జరిగించుటకు సిద్ధమనస్సు కలిగి యుండాలి. "ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నా మాటగైకొనును, అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును. మేము వాని యొద్దకు వచ్చి వాని యొద్ద నివాసము చేతుము. నన్ను ప్రేమింపనివాడు నా మాట గైకొనడు" అని అందుకు యేసుచెప్పెను (యోహాను 15:23).

-రిక్ బ్రమ్ బేక్

గొప్ప ప్రోత్సాహము నిచ్చుచున్నాయని వారు తెలియజేసిరి. సోదరులు యన్. ప్రసాద్ గారు, రామచంద్రపురంలోను, పరిసర గ్రామములలోను ఎంతో ఆసక్తితో దేవుని సేవచేయుచున్నారు.

25వ తేదీ బుధవారం బిల్లి బ్లాండ్ గారితో వచ్చిన అమెరికా బృందము దేవగుప్తం దగ్గరయున్న పెద ఆంధ్రపేటలో వాక్యపరిచర్య చేసిరి. మంచిపని చేయుచున్నందున వారు సోదరులు యన్. ఏలియా గారిని ఆయన కుమారుడు జగజీవన్‌ను అభినందించిరి.

26వ తేదీ గురువారం పైనుదహరించిన అమెరికా క్రీస్తుసంఘ బృందము మధ్యాహ్నానం 3 గంటలకు పిఠాపురంలోను, రాత్రి 7 గం॥లకు కొవ్వూరులోను వాక్యపరిచర్య చేసిరి. కొవ్వూరులో బట్టు చంటిగారి ఆధ్వర్యమున గొప్ప సువార్తకూటము జరిగెను. సోదరులు రిక్కీగూటం గారు కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిరి.

27వ తేదీ శుక్రవారం గోరింటలో మంచి సువార్త కూటము జరిగెను. బిల్లీబ్లేండ్ గారు, ఏండ్రూవిల్సన్ గారు మంచి వాక్యపరిచర్య చేయగా 5గరు క్రీస్తులోనికి బాప్తీస్మముపొందిరి. గోరింటలోను, చదలాడలోను ప్రేమ్‌కుమార్‌గారు సువార్తచాటుచున్నారు.

28వ తేదీ శనివారం ఉదయం చెయ్యేరు గున్నేపల్లిలోను, మధ్యాహ్నం వాడపత్రులోను మంచి సువార్తకూటములు జరిగెను. వాడపత్రులో ముగ్గురు క్రీస్తులోనికి బాప్తిస్మముపొందిరి. గున్నేపల్లిలో జోసఫ్‌రాజు గారును, వాడపత్రులో డి. రంగారావు గారును వాక్యపరిచర్యచేయుచున్నారు. గున్నేపల్లిలో బల్లీబ్లేండ్ గారు, డిలాన్‌కూపర్ గారు వాక్యపరిచర్యచేయగా, వాడపత్రులో ఆంద్రూవిల్సన్ గారు, ఆర్ట్‌క్రో గారు వాక్యము నందించిరి.

30వ తేదీ సోమవారం ఉదయం వీధివారి లంకలో గొప్ప సువార్తకూటము జరిగెను. అనేకమంది హాజరైరి. రాత్రివేళ పెదపళ్లలో మంచి సువార్తకూటము జరిగెను. పై రెండుచోట్ల అమెరికానుండి వచ్చిన జిమ్‌కెల్లీ, బిల్లీబ్లాండ్ తదితరులు వాక్యపరిచర్యచేసిరి. వీధివారిలంకలో కె. దేవిడ్‌రాజు గారు, పెదపళ్లలో గుమ్మడి ఇశ్రాయేలు గారు మంచి పరిచర్యచేయుచున్నారు. డిశంబరు 1 నుండి 4 వరకు సత్యవాణి ఆధ్వర్యమున గొప్ప బైబిలు లెక్చరర్‌షిప్ జరుగుటకు ఏర్పాట్లన్నియు ఈ పత్రిక ముద్రించు సరికి సిద్ధము చేయబడెను.

# ప్రకటన గ్రంథము
# ఉపదేశ మాలిక
# ఇప్పుడు లభించుచున్నది.

200 పేజీలతో అందమైన కవర్‌తో ముద్రించబడి యున్నది.

ఒక్కొక్క కాపీ 50/- రూ॥లు మాత్రమే

పోస్టేజీ 10/- రూ॥లు

ప్రకటన గ్రంధ ఉపదేశమాలిక వలయు వారు దిగువ చిరునామాకు **M.O.** పంపి దానిని పొందవచ్చును.

***Satya Vani***

7-9-35, Sambamurty Street,
Kakinada - 533 004. Ph : 0884 - 2363722

**RNI Regd. No. 6997/98**
**Postal Regd. No. AP/KD-02/2009-2011**

**To**

From:

**SATYA VAKKU**
**P.O. Box 80, Kakinada - 533 001**

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication. Sambhamurthy St. Kakinada - 533 004